శబరిమల స్వాములకు 20 ప్రత్యేక రైళ్లు 6

బీసీ హాస్టల్‌లో అగ్నిప్రమాదం 6

బస్సు ఢీకొని యువకుడి మృతి 6





రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద భద్రతా బలగాలు

అడవిలో కలిసిన.. ఆరో ప్రాణం!

ఆరుగురు మావోల ఎన్‌కౌంటర్

ఉమ్మడి జిల్లాలో ఉలికిపాటు

అడవిలో మావోయిస్టుల ఆరో ప్రాణం కలిసిపోయింది. ఉమ్మడి జిల్లా వణికింది.. మారేడుమిల్లి పేరు మళ్లీ మార్మోగింది.. ఎన్నో ఏళ్ల తర్వాత మళ్లీ తూటాలు పేలాయి.. ఆరుగురు మావోయిస్టుల ప్రాణాలు గాలిలో కలిశాయి.. పచ్చని చెట్లపై రక్తపు మరకలు పడ్డాయి. చాలా ఏళ్ల కిందట మారేడుమిల్లి అడవులకు వెళ్లాలంటే భయపడేవారు. అటువంటిది మావోయిస్టుల ప్రాభవం తగ్గింది.. దీంతో ఇప్పుడిప్పుడే అడవి అందాలు ఆస్వాదించేందుకు ఏజెన్సీ బాట పడుతున్నారు.. ఆరుగురు మావోల ఎన్‌కౌంటర్‌తో మళ్లీ భయం పెరిగింది.

- (కాకినాడ/మారేడుమిల్లి/రంపచోడవరం-ఆంధ్రజ్యోతి)

మారేడుమిల్లి ప్రముఖ పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతోంది. పర్యాటకులు ప్రకృతి అందాలు తిలకించేందుకు పోటెత్తుతుంటారు. అయితే ఉన్నట్టుండి ఒక్కసారిగా మంగళవారం ఉదయం ఆరున్నర గంటల సమయంలో తుపాకీ మోతలు.. బుల్లెట్ల శబ్దాలతో ఏం జరుగుతుందో తెలియని భయం నెలకొంది. కానీ ఆ తర్వాత కాసేపటికే ఎన్‌కౌంటర్ జరిగిందని తెలిసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉలిక్కిపడింది.

- మారేడుమిల్లిలో ఘటన
- గత కొన్నేళ్లుగా కానరాని జాడ
- తాజా ఎన్‌కౌంటర్‌తో అలజడి
- పోలీసుల ముమ్మర కూంబింగ్
- రంపచోడవరానికి మృతదేహాలు
- సామర్లకోటలో చిక్కిన మావోలు
- వీరిద్దరు హిడ్మా లేడీ గన్‌మెన్లు?

రాజమండ్రికి 100కి.మీ

ఉమ్మడి జిల్లాలో మావోయిస్టుల ఉనికి లేదనుకున్న తరుణంలో ఒక్కసారిగా భారీ సంఘటన కలకలం రేపింది. పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందడం.. అందులో ఒకరు మూడు రాష్ట్రాలు, కేంద్రం హిట్‌లిస్ట్‌లో ఉన్న మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు హిడ్మా కావడం పెను సంచలనంగా మారింది. అసలు మావోల జాడే లేదనుకున్న మారేడుమిల్లిలో ఏకంగా మావోయిస్టు అగ్రనేత తలదాచుకోవడం.. ఎన్‌కౌంటర్‌లో ఆయనతో పాటు మరో ఆరుగురు మరణించడం కలకలం రేపింది. రాజమహేంద్రవరం నుంచి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం వంద కిలోమీటర్లే కావడంతో విషయం తెలిసి ఉమ్మడి జిల్లా ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మారేడుమిల్లి మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలోనే ఉండడం గమనార్హం. అదే సమయంలో ప్రశాంత నగరంగా పేరొందిన కాకినాడలో ఇద్దరు మహిళా మావోయిస్టులు పట్టుబడడం, వీరు హిడ్మా గన్‌మెన్‌లు కావడంతో ఉమ్మడి జిల్లా ఒకేరోజు రెండు ఉలిక్కిపడే ఘటనలతో వణికింది.

హిడ్మా ఇక్కడకెందుకొచ్చాడు చెప్మా?



మోస్ట్‌వాంటెడ్.. 26 కేసుల్లో నిందితుడిగా ఉన్న మావోయిస్టు హిడ్మా మారేడుమిల్లి అడవులకు రావడమేంటనే ప్రశ్న మొదలైంది. ఎక్కడో ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం అడవుల నుంచి తూర్పు కనుమల్లోని మారేడుమిల్లి అడవులకు రావడం చర్చనీయాంశంగా మారింది. మావోయిస్టు అగ్రనేత మారేడుమిల్లి అడవుల్లో సంచరించడం సంచలనం సృష్టించింది. మరోపక్క కాకినాడకు సమీపంలోని సామర్లకోట మండలం కొప్పవరంలో మంగళవారం మధ్యాహ్నం ఇద్దరు మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేయడం కలకలం రేపింది. వీరిద్దరు చనిపోయిన మావోయిస్టు అగ్రనేత హిడ్మా గన్‌మెన్‌లుగా పోలీసులు గుర్తించినట్టు సమాచారం. వీరు కొప్పవరం వద్ద రహదారి దాటుతుండగా పోలీసులకు చిక్కారు.

20 ఏళ్ల కిందట ఒకటి..

ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో మారేడుమిల్లి, వై.రామవరం అడవుల్లో మావోయిస్టుల ప్రాబల్యం ఉండేది. 1987 డిసెంబరు 27న ఏడుగురు ఐఏఎస్ అధికారులను మావోయిస్టులు వై.రామవరంలోని గుర్తేడు అడవుల్లో కిడ్నాప్ చేసిన ఘటన సంచలనంగా మారింది. ఆ తర్వాత మారేడుమిల్లి, వై.రామవరం అడవుల్లో వరుసగా మావోయిస్టులు పలువురిని చంపడం, వరుస కూంబింగ్‌లలో మావోయిస్టులు మరణించడం జరిగేవి. అయితే గడచిన కొన్ని దశాబ్దాలుగా మారేడుమిల్లిలో మావోయిస్టుల జాడే లేదు. మళ్లీ కొన్ని దశాబ్దాల తర్వాత మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరగడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. ప్రస్తుతం ఎన్‌కౌంటర్ జరిగిన చోటుకు అతి సమీపంలో 20 ఏళ్ల కిందట ఓ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది.

అడవిని వదిలేసిన మావోలు..

ఛత్తీస్‌గఢ్ నుంచి ఆంధ్రా ప్రాంతంలోని పలు నగరాల్లోకి మావోయిస్టులు పెద్దఎత్తున చొరబడ్డారనే విషయం సంచలనంగా మారింది. ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో మావోయిస్టులకు తగులుతున్న వరుస ఎదురుదెబ్బలతో అక్కడ మనుగడ సాగించలేని పరిస్థితుల్లోనే మావోలు మన ఏజెన్సీని సురక్షిత ప్రాంతంగా ఎన్నుకోవడంతోపాటు ఇక్కడి నెట్‌వర్క్ ద్వారా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారన్న సమాచారం హడలెత్తిస్తోంది. దీంతో ఆంధ్రాలోకి చొరబడే మార్గాల వెంబడి నిఘాను పెంచి వారి కదలికలను భద్రతా దళాలు గుర్తించినట్టు చెబుతున్నారు. ప్రస్తుతం అడవుల్లో ప్రత్యేక బలగాలతో కూంబింగ్‌లతోనూ, నగరాల్లో ఆక్టోపస్ బలగాలతోనూ పోలీసులు గాలిస్తున్నారు. మావోల కదలికలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

అల్లూరి జిల్లా షెల్టర్ జోన్ కానివ్వం



అల్లూరి సీతారామరాజు జిల్లాను మావోయిస్టులకు షెల్టర్‌జోన్ కానివ్వం. ఏపీ సరిహద్దు రాష్ట్రాల్లో ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితుల్లో మావోయిస్టులు అల్లూరి జిల్లాను షెల్టర్ జోన్ చేసుకుని మనుగడ సాధిద్దామనుకుని ఇక్కడకు చొరబడితే తగిన గుణపాఠం చెబుతాం. మావోయిస్టులు ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయారు. వారిని భయపెట్టి ఉద్యమాన్ని సాగించాలనుకున్నా ఎవరూ భయపడడం లేదు. ప్రజల్లో వారికి పెరిగిన వ్యతిరేకతే వారి అంతానికి కారణం. ఇకనైనా ఉద్యమాన్ని వీడి జన జీవన స్రవంతిలో కలవాలనుకునే మావోయిస్టులకు తాము స్వాగతం పలుకుతాం. - **అమిత్ బర్దర్, ఎస్పీ**

7 నెలలు.. 3 ఎన్‌కౌంటర్లు

(చింతూరు - ఆంధ్రజ్యోతి)

రంపచోడవరం ఏజెన్సీలో ఈ ఏడాది గడచిన ఏడు నెలల్లో మూడు ఎన్‌కౌంటర్లు జరిగాయి. 11 మంది మావోయిస్టులు మృతిచెందారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి, వై.రామవరం మండలాల అడవుల్లో ఇటీవల వరుస ఎన్‌కౌంటర్లతో ఆందోళన నెలకొంది. రంపచోడవరం అడవుల్లో గత దశాబ్దకాలంగా చెప్పుకోదగ్గ ఘటనలేమీ లేవు. ఈ ఏడాది వై.రామవరం మండలం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు.వారిలో ఆంధ్ర ఒడిస్సా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు టకూరి పండన్న అలియాస్ జగన్, ఏవోబీ డివిజన్ కమిటీ సభ్యుడు రమేష్ ఉన్నారు. జూన్‌లో మారేడుమిల్లి మండలం కింటు కుర్రు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావో యిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి, అలియాస్ ఉదయ్, కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి భార్య రావి వెంకట చైతన్య, కొవ్వాసి అంజు అలియాస్ మాసే ఉన్నారు. ఇక మంగళవారం మారేడుమిల్లి మండలం జీఎం వలస పంచాయతీలోని నెల్లూరు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, సౌత్ బస్తర్ బెటాలియన్ నాయకుడు హిడ్మా అలియాస్ సంతోష్, అతడి భార్య రాష్ట్ర కమిటీ సభ్యురాలు రాజే అలియాస్ రాజక్క, దేవే, లఖాల్ అలియాస్ చైతు, మల్ల అలియాస్ మల్లాలు, కమ్లు కమలేష్ ఉన్నారు. ఇంతవరకూ జరిగిన ఎన్‌కౌంటర్లలో మృతిచెందిన వారంతా ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దు క్యాడర్ వారే. తాజా ఎన్‌కౌంటర్లో మృతి చెందింది మాత్రం ఛత్తీస్‌గఢ్ క్యాడర్ కావడం విశేషం.

డిప్యూటీ సీఎం ఇంటి వద్ద జనవాణికి ఏర్పాట్లు

గొల్లప్రోలురూరల్,నవంబరు 18(ఆంధ్రజ్యోతి):పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసంవద్ద జనవాణికార్యక్రమం నిర్వహణకు మళ్లీ ఏర్పాట్లు మొదలయ్యాయి. ఇందులోభాగంగా మంగళవారం అర్జీదారుల కోసం ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేసే పనులు మొదలయ్యాయి. వచ్చే సోమవారంనుంచి ప్రజాసమస్యలపై ఉదయం 9.30గంటలనుంచి సాయంత్రం 5గంటలవరకు అర్జీలు స్వీకరిస్తారని జనసేన నాయకులు తెలిపారు.

రేషనలైజేషన్‌కు రాజకీయ పార్టీలు సహకరించాలి

ఇన్‌చార్జ్ కమిషనర్ సుధాకర్

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో పోలింగ్‌స్టేషన్ల రేషనలైజేషన్, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటర్ జాబితా కార్యక్రమాలను సజావుగా నిర్వహించడానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల పూర్తి సహకారం అవసరమని నగరపాలకసంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్, నగర ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేటీ సుధాకర్ అన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన అర్బన్ తహసీల్దార్ జితేంద్రతో కలిసి రాజకీయపార్టీల ప్రతినిధులతో మాట్లాడారు. ఎన్నికల కమిషనర్ సూచనల మేరకు ఓటర్ జాబితా సవరణ, ఫారమ్-6,7,8 పరిష్కారం, కొత్త ఓటర్ల నమోదు, పోలింగ్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాలపై వివరాలు అందించారు. రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి అవసరమైన వివరాలను త్వరితగతిన సమర్పించాలన్నారు. కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, డీటీ కృష్ణకుమారి, ఇన్‌చార్జ్ ఏఎస్‌డబ్ల్యూఓ కె.రాధ, డీసీపీ కేవీ కృష్ణారావు, ఏసీపీ ఎ.శ్రీధర్, రాజకీయపార్టీల ప్రతినిధులు తుమ్మల రమేష్(టీడీపీ), వెంకటేశ్వరరావు(వైసీపీ), సత్యనారాయణ(జనసేన), సుబ్బారావు, అప్పారావు(బీఎస్పీ), శ్రీనివాసు(ఐఎస్సీ),నంబి(ఆప్) పాల్గొన్నారు.



జలపాతాలకు పర్యాటకుల సందడి

- ధారపల్లి, ఎరకంపాలెం కొండల వద్ద పెరిగిన సందర్శకుల తాకిడి

ప్రత్తిపాడు మండలంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ కొండలోని ఎరకంపాలెం జలపాతానికి తరలివచ్చిన పర్యాటకులు

ప్రత్తిపాడు,నవంబరు 18(ఆంధ్రజ్యోతి):జలపాతాలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. కార్తీకమాసం కావడంతో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం సబ్‌ప్లాన్ ఏజెన్సీ కొండల్లోని ధారపల్లి, ఎరకంపాలెం, తోటపల్లి వద్ద కొండపై నుంచి ప్రవహిస్తున్న జలపాతాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ మూడు ప్రదేశాల వద్ద స్నానాలు ఆచరించి సేదతీరేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. ప్రత్తిపాడుకు 20కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈమూడు ప్రదేశాల్లో ధారపల్లి జలపాతానికి అధికసంఖ్యలో సందర్శకు లు తరలివస్తున్నారు. బురదకోట కొండదిగువున ధారపల్లి వద్ద ఉన్న ఈ జలపాతం ప్రదేశం ప్రకృతి ఒడిలో పొదిగినట్లుగా ఎత్తయిన కొండనుంచి జాలువారుతూ సందర్శకులకు మంచి అనుభూతి కలిగిస్తోంది. స్వచ్ఛమైన నీరు, ఆహ్లాదం కలిగించే చుట్టూ ఎత్తయిన కొండలు, వృక్షాల మధ్య ఉన్న కొం డలు పర్యాటకులను మైమరపిస్తోంది. ఈ.గోకవరం సమీపం లో ఎరకంపాలెం కొండల్లో ఉన్న జలధారలు శివలింగాన్ని అభిషేకిస్తూ కిందకు జాలువారుతూ ఉంటాయి. ఈ కొండ ఎక్కడం కష్టతరంగా ఉంటుంది. అయినా కొందరు ఎక్కి జలపాతం వద్ద స్నానాలు ఆచరించి శివలింగానికి పూజలు చేసి వస్తుంటారు. కొండ దిగువన ధారా మల్లికార్జునస్వామి ఆలయం, కంద దేశిక ఆశ్రమాలవద్ద సందర్శకులను సేదతీరుతారు. మండలంలోని శాంతిఆశ్రమం సమీపంలోని తోటపల్లికొండల్లో మరో జలపాతం శివలింగాన్ని అభిషేకిస్తూ ఉంటుంది. ఇక్కడి జలధారల్లోను పర్యాటకులు స్నానాలు ఆచరించి భ్రమరాంబిక మల్లికార్జున స్వాములను దర్శించుకుంటారు.



ప్రత్తిపాడు మండలం ధారపల్లి జలపాతం వద్ద సందర్శకుల సందడి

సత్యదేవుడి సన్నిధిలో సహస్ర జ్యోతిర్లింగార్చన

అన్నవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం మాసశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని సహస్ర జ్యోతిర్లింగార్చన కార్యక్రమం కనులపండువగా జరిగింది. అనివేటి మండపంలో వెయ్యిదీపాలతో లింగాకారం ఏర్పాటు చేసి వాటిపై ఓంకారం, స్వస్తిక్ చిహ్నాలను ఏర్పాటు చేశారు. అనంతరం వాటిని భక్తులు, ఉద్యోగులు, అర్చకస్వాములతో వెలిగించారు. ఈ సందర్భంగా స్వామి,అమ్మవార్లకు ఈ సహస్రజ్యోతుల వెలుగులో ప్రత్యేకపూజలు వెలిగించారు. ప్రతినెలా మాసశివరాత్రి పర్వదినం వస్తున్నా కార్తీకమాసంలో వచ్చే మాసశివరాత్రి రోజున మాత్రమే ఈసహస్ర జ్యోతిర్లింగార్చన నిర్వహిస్తామని పండితులు తెలిపారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.



అనివేటి మండపంలో సహస్ర జ్యోతిర్లింగాల దివ్యరూపం

'పాదగయ'లో ఆకట్టుకున్న మంచు శివలింగం



పిఠాపురం పాదగయలో శివస్వాముల పూజల సందర్భంగా ఏర్పాటు చేసిన మంచు శివలింగం విద్యుత్ కాంతుల్లో రంగులు మారుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. (ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

తునిలో ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లపై దాడులు

- డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు
- కొన్నింటికి రిజిస్ట్రేషన్లు ఉన్నా రెన్యువల్ లేని వైనం

తుని రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):తుని పట్టణంలో కొన్నిరోజులుగా పుట్టగొడుగుల్లా పుట్టుకువచ్చిన ప్రైవేట్ ల్యాబ్‌లు, ఆస్పత్రులపై ఫిర్యాదులు అందుకున్న వైద్యఆరోగ్యశాఖ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి నరసింహనాయక్ ఆధ్వర్యంలో ఆస్పత్రులను, ల్యాబ్‌లను తనిఖీ చేశారు. శ్రీలక్ష్మి జనరల్ హాస్పటల్, అంకారెడ్డి డెంటల్ ఆస్పత్రి, దుర్గాప్రసాద్ డయాబెటికల్ మెడికల్ సెంటర్, రవితేజ ల్యాబొరేటరీ, లీలా నర్సింగ్ హోం, సురేష్ హాస్పటల్స్‌ను అధికారులు పరిశీలించారు. రిజిస్ట్రేషన్లతోపాటు పత్రాలు తనిఖీ చేయగా లైసెన్స్‌లు కలిగిఉన్నా.. కొన్నేళ్లుగా రెన్యువల్‌చేసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై డీఎంహెచ్‌వో ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని పలు ఆస్ప త్రులకు నోటీసులు జారీ చేశారు. రెన్యువల్ చేయించుకోకపోతే భారీజరిమానా విధిస్తామన్నారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న జ్యోతి డయాగ్నోస్టిక్స్ సెంటర్‌ను అధికారులు సీజ్ చేశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అన్ని ఆస్పత్రుల్లో ధరల పట్టిక, సేవలు, డాక్టర్ల వివరాలు ప్రదర్శించాలన్నారు. అనుమతులు లేకుండా నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అన్నదాతకు అండగా..

- నేడు రైతుల ఖాతాల్లోకి 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ' నిధులు
- జిల్లాలో 1,50,475 మంది ఖాతాల్లోకి రూ.99.88 కోట్లు
- నియోజకవర్గాల్లో పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొననున్న ఎమ్మెల్యేలు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ నిధులు బుధవారం విడుదల కానున్నాయి. జిల్లాలో 1,50,475మంది రైతుల బ్యాంకుఖాతాల్లోకి రూ.99.88కోట్లు జమ కానున్నాయి. కేంద్రప్రభుత్వం రూ.2వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేల చొప్పన జమచేయనుంది. రైతులను పూర్తిగా ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రెండోవిడతలోను రైతులకు నిధులు అందజేస్తోంది. గత ఆగస్టులో తొలివిడతగా రైతులకు రూ.101.97కోట్లు నిధులు రైతులకు అందజేసింది. దీంతో అప్పట్లో రైతులు హర్షం వ్యక్తం చేశారు. తాజాగా మరోసారి రెండో విడత పీఎం కిసాన్- అన్నదాతా సుఖీభవ నిధులు విడుదల చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని సామర్లకోటలో జరిగే పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్‌లు పాల్గొంటున్నారు. ఇతర ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు పాల్గొంటున్నారు. మండలాలవారీగా పరిశీలిస్తే.. కాకినాడ రూరల్ మండలంలో 1,920మంది రైతులకు రూ.1.31కోట్లు, కరప 8156 రైతులకు రూ.5.51కోట్లు, కాకినాడ అర్బన్ 111 రైతులకు రూ.8లక్షలు, పిఠాపురం 9818 రైతులకు రూ.6.41కోట్లు, గొల్లప్రోలు 8469 రైతులకు రూ.5.50కోట్లు, యూ.కొత్తపల్లి 4818 రైతులకు రూ.3.12కోట్లు జమ అవుతాయి. తుని 11427 రైతులకు రూ.7.44కోట్లు, తొండంగి 8422 రైతులకు రూ.5.49కోట్లు, కోటనందూరు 7768 రైతులకు రూ.5.16కోట్లు, ప్రత్తిపాడు 9873 రైతులకు రూ.6.50కోట్లు, ఏలేశ్వరం 5162 రైతులకు రూ.3.48కోట్లు, రౌతులపూడి 10091 రైతులకు రూ.6.62కోట్లు, శంఖవరం 6508 రైతులకు రూ.4.24కోట్లు, పెద్దాపురం 7817 రైతులకు రూ.5.21కోట్లు, సామర్లకోట 7104 రైతులకు రూ.4.81కోట్లు, జగ్గంపేట 9368 రైతులకు రూ.6.26కోట్లు, కిర్లంపూడి 6630 రైతులకు రూ.4.56కోట్లు, గండేపల్లి 7117 రైతులకు రూ.4.73కోట్లు, తాళ్లరేవు 4036 రైతులకు రూ.2.73కోట్లు, పెదపూడి 6996 రైతులకు రూ.4.74కోట్లు, కాజులూరు 8864 రైతులకు రూ.5.98కోట్లు రైతుల ఖాతాలలో జమ కానున్నాయి.

నిధుల విడుదల కార్యక్రమాన్ని జిల్లాలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో(ఆర్ఎస్‌కే) ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. అగ్రిటెక్, డిమాండ్ ఉన్న పంటల సాగు, మార్కెట్ సౌకర్యాల పెంపు, ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షలు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు.

జేఎన్‌టీయూకేలో 'నషా ముక్త్ భారత్ అభియాన్' వేడుకలు

జేఎన్టీయూకే,నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సమస్యలను మత్తుతో కాకుండా సహాయం కోరుతూ పరిష్కరించుకోవాలని కాకినాడ జిల్లా ఏఎస్పీ ఎస్.శ్రీనివాసరావు సూచించారు. నషా ముక్త్‌భారత్ అభియాన్ ఐదేళ్ల వేడుకలను వర్సిటీలో ఎన్ఎస్ఎస్, యూసీఈకే, జేఎన్టీయూ వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లీ ఏబుల్డ్, ట్రాన్స్‌జెండర్, సీనియర్ సిటిజన్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో మంగళవారం సంయుక్తంగా నిర్వహించారు. మొదటిగా ర్యాలీ, ప్రతిజ్ఞ, ఆన్‌లైన్‌లో లైవ్ సందేశం.. తర్వాత అతిథులు ప్రసంగించారు. ఏఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ యువతలో ఒత్తిడి, ఆందోళన, మానసిక భారం పెరిగే సందర్భాల్లో మత్తుపదార్థాల బానిసత్వం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రావు, ఏడీ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న అతిథులు, ఎన్ఎస్ఎస్ అధికారులు



సూర్యుడి.. శుభోదయం!

మంచు తెరల మాటు నుంచి సూర్యుడు ఉదయించాడు. శుభోదయం అంటూ గిరిసీమను మురిపించాడు. అల్లూరి జిల్లా చింతూరు శబరి నది పక్కన రహదారిని ఆనుకుని ఉన్న పొలాల్లో మంగళవారం ఉదయం 6.30 గంటల సమయంలో కనిపించిన సూర్యోదయం చిత్రాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

- చింతూరు (ఆంధ్రజ్యోతి)



విపత్తుల సమయంలో...
సామాజిక అవగాహన అవసరం



లంకలగన్నవరం మాక్‌ఎక్సర్‌సైజ్‌లో మాట్లాడుతున్న ఎన్‌డీఆర్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ దిల్‌బాగ్‌సింగ్

- ఎన్‌డీఆర్‌ఎఫ్ పదో బెటాలియన్ కమాండెంట్ దిల్‌బాగ్‌సింగ్
- జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఐదురోజులు మాక్ ఎక్సర్‌సైజ్‌లు

పి.గన్నవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విపత్తులు సంభవించినప్పుడు ప్రతి వ్యక్తి అతడితో పాటు ఇతరులను సైతం రక్షించుకోవడానికి సామాజిక అవగాహన కలిగి ఉండాలని ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ కమాండెంట్ దిల్‌బాగ్‌సింగ్ సూచించారు. మంగళవారం లంకలగన్నవరంలో ముఖ్యంగా విపత్తులు సంభవించినప్పుడు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు రెవెన్యూ, పోలీసు, ఫైర్ సిబ్బంది సేవలందిస్తారని తెలిపారు. గోదావరి వరదలు, తుఫాన్‌లు, భూకంపాలు సంభవించినప్పుడు మనల్ని మనం కాపాడుకోవాలని అనే అంశాలపై మాక్ ఎక్సర్‌సైజ్ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్టు ఆయన చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఐదు రోజుల పాటు మాక్ ఎక్సర్‌సైజ్ ద్వారా స్థానిక ప్రజానీకానికి అవగాహన కల్పించడం జరుగు తుందన్నారు. ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా 10 పాఠశాలల్లో విద్యార్థులకు స్కూల్ సేఫ్టీ ప్రో గ్రామ్‌లు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహ శీల్దార్ టీమ్ కమాండర్ ఇన్‌స్పెటర్ రాజేంద్ర కుమార్ సరోజ్, ఎస్ఐ బి.శివకృష్ణ, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఫైర్ ఎస్ఐ పి.శ్రీనివాస్, సర్పంచ్ గనిశెట్టి గంగాభవాని, ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



మాక్‌ఎక్సర్‌సైజ్‌లో భాగంగా సీపీఆర్ చేస్తున్న దృశ్యం

● ఆకట్టుకున్న మాక్ ఎక్సర్‌సైజ్ విన్యాసాలు

మాక్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా కమాండెంట్ దిల్‌బాగ్‌సింగ్, టీమ్ కమాండెర్ రాజేంద్ర కుమార్‌సరోజ్ ఆధ్వర్యంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది చేసిన విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత గోదావరి వరదల సమయంలో బోటు తిరగబడితే ఎలా రక్షించాలో చూపించారు. ముఖ్యంగా గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్ ఎలా చెయ్యాలో కళ్లకు కట్టినట్టు వివరించారు. అనంతరం గోదావరి వరదల సమయంలో భారీగా నీరు పోటెత్తినప్పుడు మన చుట్టు ఉన్న (ప్లాస్టిక్ బాటిళ్లు, వెండి కొబ్బరికాయలు, ఇనుప డబ్బాలు, తదితర వస్తువులు) వస్తువులతో మనల్ని మనం ఎలా కాపాడుకోవాలో గోదావరి నదిలో చేసి చూపించారు.

రచనలో మణిమకుటం



- డిజిటల్ ఇండియాలో కాగ్ పాత్రపై విశ్లేషణాత్మక వ్యాసం
- జాతీయ స్థాయిలో తృతీయ బహుమతి, రూ.30వేలు నగదు బహుమతి అందుకున్న మణిశ్రీ



న్యూఢిల్లీలో నగదు ప్రోత్సాహక బహుమతి, ప్రశంసాపత్రం అందుకుంటున్న మణిశ్రీ

అమలాపురం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ ఇండియాలో కాగ్ పాత్రపై ఇంజనీరింగ్ విద్యార్థిని విత్తనాల మణిశ్రీ అద్భుత విశ్లేషణ చేసి జాతీయ స్థాయిలోమెరిసింది. జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్‌లోని భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో క్యాడ్ అండ్ ఎంఎల్ ఇంజనీరింగ్ విభాగంలోమణిశ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ ఏడాది అక్టోబరులో మై భారత్ పోర్టల్ ద్వారా భారత రాజ్యాంగ నియంత్రణ-లెక్కల పరిశీలనాధికారి (కాగ్) కార్యాలయం ఆధ్వర్యంలో ఆడిట్ దివస్-2025 సందర్భంగా నిర్వహించిన జాతీయస్థాయి ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలో పాల్గొంది. ఆమె విశ్లేషణాత్మక వ్యాసం జాతీయ స్థాయిలో తృతీయ స్థానం దక్కించుకున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు తెలిపారు. మణిశ్రీ రచనలో స్పష్టత, విశ్లేషణాత్మక విధానం, పారదర్శకత-డిజిటల్ పాలనపై సునిశితమైన అవగాహన ప్రతిబింబించాయని జాతీయ నిర్వాహకులు కొనియాడారు.న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఆడిట్ దివస్‌లో మణిశ్రీకి రూ.30వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్ని కాగ్ పరిశీలనాధికారి కె.సునయ్‌మూర్తి అందజేశారు. మణిశ్రీని ప్రిన్సిపాల్ డాక్టర్ రామారావు, చైర్మన్ బోనం కృష్ణసతీష్, క్యాడ్ అండ్ ఎంఎల్ విభాగాధిపతి జి.విజయకుమారి, అధ్యాపకులు, సహచర విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్ర వాలీబాల్, టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక



వాలీబాల్ పోటీలకు ఎంపికైన మునిపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు



రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్‌కు ఎంపికైన విద్యార్థులు

ఉప్పలగుప్తం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం మండలం మునిపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు సీహెచ్ హెప్సీబా, ఎం.కావ్యశ్రీ, ఎం.పావని అండర్-14 వాలీబాల్ విభాగంలో సత్తా చాటారు. ఈ మేరకు మంగళవారం ఆ పాఠశాల హెచ్ఎం ఎం.వెంకటసుబ్బారావు మాట్లాడుతూ వీరంతా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. ఈనెల 22 నుంచి 24 వరకు నెల్లూరులో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, పీడీ నూకల సీతాపతి, గ్రామపెద్దలు అభినందించారు.

దేవరపల్లి: దేవరపల్లి మండలంలోని రామన్నపాలెం హైస్కూల్‌లో టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సబ్ జూనియర్ స్థాయి బాలబాలికల సెలక్షన్స్ జరిగాయి. ఇందులో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు ఈనెల 21,22 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా సోండిపూడిలో జరిగే క్రీడల్లో పాల్గొంటారని శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ తెలిపారు. టెన్నికాయిట్‌కు ఎం.ప్రియదర్శిని, షేక్ లతిపా, ఆర్. శౌరిక, ఎం. లోహితశ్రీ, పీ.అక్షయ, బాలురు జీ.బాబి, వై.ఈశ్వర్, చిన్నబాబు, ఆకాశ్, ఎంపికయ్యారు. కార్యక్రమంలో టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు గద్దే చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి ఏవీఆర్ సరస్వతి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

శిఖామణికి సప్పా ఎక్స్ లెన్స్ అవార్డ్-2025



శిఖామణి

యానాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ నాట్య గురువు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ జన్మదినం సందర్భంగా ప్రతి ఏటా ఇచ్చే సప్పా ఎక్సలెన్స్ అవార్డ్- 2025కు సాహిత్య విభాగంలో యానాంకు చెందిన ప్రముఖ కవి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు, కవి సంధ్యా సంపాదకుడు, కళారత్న డాక్టర్ శిఖామణి ఎంపికయ్యారు. ఈనెల 23 వ తేదీ ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరంలోని తాడితోటలో గల సంహిత కన్వెన్షన్ హాలులో అవార్డుల ప్రదానోత్సవ సభ జరగనుంది. సాహిత్య, కళా, సామాజిక, తదితర రంగాలలో వంశీ నివాస్, పొత్తూరి సుబ్బారావు, హేమ సుందర్ వంటి 15 మంది ప్రముఖులు న్నారు. సభలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మండలి బుద్ధప్రసాద్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జీవీ హర్షకుమార్, తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య డి.మునిరత్నం నాయుడు, తదితరులు పాల్గొననున్నారు. డాక్టర్ శిఖామణికి అవార్డు ప్రకటించడం పట్ల పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, దాట్ల దేవదానంరాజు, డాక్టర్ వరుగు భాస్కర్‌రెడ్డి, మధునాపంతుల సత్యనారాయణ మూర్తి, పోనుగుమట్ల విష్ణుమూర్తి, ముమ్మిడి చిన్నారి, సీహెచ్ రాం, రవి, పోనుగుమట్ల అశోక్, తదితరులు అభినందనలు తెలిపారు.

సినీ నటి హేమకు మాతృవియోగం



తల్లి భౌతికకాయం వద్ద విలపిస్తున్న హేమ

రాజోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటి హేమకు మాతృవియోగం కలిగింది. ఆమె తల్లి కోళ్ల లక్ష్మి (80) రాజోలులో సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. ఈమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తల్లి లక్ష్మి మరణ వార్త తెలియగానే హైదరాబాద్ నుంచి హుటాహుటిన హేమ బయలుదేరి రాజోలు చేరుకున్నారు. సోంపల్లిలో లక్ష్మి అంత్యక్రియలు జరిగాయి. లక్ష్మికి కుమార్తె హేమ, కుమారుడు లక్ష్మీ ఫ్యాషన్ స్టూడియో అధినేత శ్రీనివాస్ ఉన్నారు. హేమను పలువురు పరామర్శించి సంతాపం తెలిపారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

రిమాండ్‌కు తరలింపు

సీతానగరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) బాలికపై అత్యాచారానికి పాల్పడిన సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామానికి చెందిన గుడుసుల నాగ వెంకటేష్‌కు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ డి.రామ్ కుమార్ తెలిపారు. ఇంటర్మీడియట్ చదివి విశాఖపట్నంలో ఎయిర్ హోస్టెస్‌గా శిక్షణ పొందుతున్న బాలికను వాట్సాప్ ద్వారా వెంకటేష్ పరిచయం చేసుకున్నాడు. ఇంటర్వ్యూ ఉందని తల్లిదండ్రులకు చెప్పి రమ్మనడంతో ఆమె అలాగే ఇంటి వద్ద చెప్పి వచ్చింది. ఇద్దరు గత నెల 31 నుంచి హోటల్లో గడిపారు. దగ్గరకు రాకపోతే మనమిద్దరం తీసుకున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంటికి వెళ్లాక విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వెంకటేష్ ఇంటికి వెళ్లగా వెంకటేష్ తల్లి వారిని కులంపేరుతో దూషిస్తూ దుర్భాషలాడింది. దీంతో ఈ నెల 16న బాలిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంకటేష్‌తో పాటు అతడి తల్లిపై కేసు నమోదు చేశారు.నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ సోమవారం సాయంత్రం 6గంటలకు రఘుదేవపురం సెంటర్‌లో వెంకటేష్‌ను అరెస్టు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

బిడ్డలతో సహా దూకేశాడు!

- చించినాడ బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకి తండ్రి అఘాయిత్యం
- ఇద్దరి మృతదేహాలు లభ్యం.. బాలిక ఆచూకీ కోసం గాలింపు
- లక్కవరంలో విషాదచాయలు



తండ్రి దుర్గాప్రసాద్, కుమారుడు మోహిత్ మృతదేహాలు



మలికిపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో ఓ తండ్రి తన ఇద్దరు బిడ్డలతో కలిసి చించినాడ బ్రిడ్జిపైనుంచి గోదావరిలోకి దూకేశాడు. వీరిలో ఇద్దరి మృతదేహాలు లభ్యం కాగా బాలిక మృతదేహంకోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మలికిపురం మండలం లక్కవరానికి చెందిన శిరిగినీడి దుర్గాప్రసాద్(39) తన కుమారుడు మోహిత్(14), కుమార్తె జాహ్నవి(9)లతో సహా సోమవారం రాత్రి దిండి-చించినాడ వశిష్ట వారధిపైనుంచి గోదావరిలోకి దూకాడు. ముందుగా వంతెనపై తన మోటారుసైకిల్, సెల్‌ఫోన్, ఆధార్‌కార్డులను చెప్పులు వదిలేశారు. దుర్గాప్రసాద్ తన భార్య నాగవేణి, పిల్లలతో కలసి వారంరోజులుగా విశ్వేశ్వరాయపురంలోని అత్తవారింట్లో ఉంటున్నాడు. 8వ తరగతి చదువుతున్న మోహిత్, 4వ తరగతి చదువుతున్నజాహ్నవిలను ఆధార్ అప్‌డేట్ చేయించాలని చెప్పి సోమవారం సాయంత్రం ఇంట్లోనుంచి తీసుకువెళ్లి వారధిపైనుంచి దూకేశాడు. వీరి ఆచూకీ కోసం మంగళవారం ఉదయం వరకు పలుచోట్ల గాలించారు. మధ్యాహ్నం నుంచి రాజోలు, యలమంచిలి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నదిలో దుర్గాప్రసాద్, మోహిత్‌ల మృతదేహాలు లభ్యమయ్యాయి. కుమార్తె జాహ్నవి ఆచూకీ ఇంకా దొరకలేదు. చీకటి పడడంతో పోలీసులు గాలింపు చర్యలు నిలిపివేశారు. కుటుంబ మనస్పర్థల నేపథ్యంలో ఈ సంఘటన జరిగి ఉండవచ్చునని రాజోలు సీఐ టి.నరేష్‌కుమార్ తెలిపారు. అందరితో కలుపుగోలుగా ఉండి వివాదరహితంగా ఉండే దుర్గాప్రసాద్ ఈ నిర్ణయం తీసుకోవడంతో పలువురు విచారం వ్యక్తం చేశారు. తన భర్తతోపాటు కుమార్తె, కుమారుడు కనిపించడం లేదని నాగవేణి ఫిర్యాదు చేసినట్టు మలికిపురం ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. ఈ సంఘటన మలికిపురం మండలంలోని లక్కవరం, విశ్వేశ్వరాయపురం, బట్టేలంక, కత్తిమండ గ్రామాల్లో సంచలనం రేకెత్తించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

శబరిమల స్వాములకు 20 ప్రత్యేక రైళ్లు

● విశాఖ నుంచి సామర్లకోట మీదుగా కొల్లాం



సామర్లకోట, నవంబరు 18(ఆంధ్ర జ్యోతి): కార్తీకమాసంలో అయ్యప్పస్వామి భక్తుల ప్రయాణ సౌకర్యార్థం విశాఖ నుంచి సామర్లకోట మీదుగా కొల్లాంకు 20ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్టు రైల్వే ఈస్ట్‌కోస్ట్ పీఆర్వో కార్యాలయం నుంచి సామర్లకోట రైల్వేస్టేషన్‌కు ఉత్తర్వులు అందాయి. ఈ నెల 18నుంచి జనవరి 21వరకు ఈ ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు ఆ లేఖలో తెలిపారు. ఈ రైళ్లలో ప్రయాణం ద్వారా తమిళనాడులోని పలు ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలను సందర్శించే వీలుంటుందని తెలిపారు.

● నెం.08539 విశాఖ-కొల్లాం మధ్య ప్రతీ మంగళవారం ఉదయం విశాఖలో ఉదయం 8.20కు బయలుదేరి సామర్లకోటకు ఉదయం 10.28కు చేరుకుంటుంది. బుధవారం మధ్యాహ్నం 1.45కు కొల్లాం చేరు తుంది. ఈ ప్రత్యేక రైలు నవంబరు 18, 25, డిసెంబరు 2, 9, 16, 23, 30 జనవరి 6, 13, 20 తేదీల్లో పది ట్రిప్‌లుగా నడవనుంది. ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సామర్లకోటకు 10.28 గంటలకు చేరుకుని, రాజమహేంద్ర వరానికి ఉదయం 11.13కు చేరుకుంటుంది. తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పెట్టయ్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొదనూర్, పాలక్కాడ్, త్రిచూరు, అలువ, ఎర్నాకుళం టౌన్, కొట్టాయం, తిరువళ్ల, చెంగన్నూర్, కాయంకుళం మీదుగా కొల్లాం మధ్యాహ్నం 1.45గంటలకు చేరుకుంటుంది.

● నెం.08540గల కొల్లాం-విశాఖ మధ్య ప్రతీ బుధవారం సాయంత్రం 5 గంటలకు కొల్లాంలో బయలుదేరి మరుసటిరోజు గురువారంరాత్రి 11గంటలకు విశాఖ చేరుతుంది. ఈ ప్రత్యేక రైలు రాజమహేంద్రవరం నకు సాయంత్రం 6.13కు చేరుకుని, సామర్లకోటకు రాత్రి 7.00 గంటలకు చేరుకుని దువ్వాడ మీదుగా విశాఖకు రాత్రి 11 గంటలకు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైలు నవంబరు 19, 26 డిసెంబరు 3, 10, 17, 24, 31 జనవరి 7, 14, 21 తేదీలలో పది ట్రిప్‌లుగా నడవనుంది. ఈ రైలులో రిజర్వేషన్ టిక్కెట్ల బుకింగ్‌కు సమీపంలోని రైల్వే బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే పీఆర్వో కార్యాలయ అధికారి ఆ ఉత్తర్వుల్లో తెలిపారు.

కరప బీసీ హాస్టల్‌లో అగ్నిప్రమాదం

పాత ఫర్నీచర్ దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

కరప, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో సోమవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. అధికారులు, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెనుప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక పీహెచ్‌సీ వెనుక జీ+3 భవనంలో బీసీ గురుకుల పాఠశాల నిర్వహిస్తున్నారు. 213 మంది విద్యార్థులు ఐదు నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. భవనానికి కేటాయించిన లిఫ్ట్ జాగా ఖాళీగా ఉండడంతో సిబ్బంది అందులో పాత ఫర్నీచర్‌ను డంప్‌చేశారు. రెండో అంతస్తు వరకూ పేరుకుపోయిన ఈ ఫర్నీచర్ ఒక్కసారిగా తగులబడి భవనంపై వరకూ మంటలు వ్యాపించాయి. అప్పటివరకూ చదువుకుని మూడు అంతస్తుల్లోనూ నిద్రకు ఉపక్రమిస్తున్న విద్యార్థులు ఈ మంటలను చూసి ప్రాణభయంతో కేకలు వేశారు. నైట్ వాచ్‌మెన్, డ్యూటీ టీచర్లు స్పందించి అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. విద్యార్థులను మెట్ల మార్గం ద్వారా కిందకు తీసుకొచ్చారు. కరప ఎస్ఐ తోట సునీత, పోలీస్ సిబ్బంది, కాకినాడ జగన్నాయకపూర్ ఫైర్‌స్టేషన్ నుంచి అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కాగా అసలు లిఫ్ట్ జాగాలోని పాత ఫర్నీచర్‌కు నిప్పు ఎలా అంటుకుందనే దానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా కాకినాడ జిల్లా బీసీ కళాశాల కన్వీనర్ లోవరాజు మంగళవారం సందర్శించి ఘటనపై విచారణ చేపట్టారు.

ప్రైవేట్ బస్సు ఢీకొని యువకుడి మృతి

జగ్గంపేట రూరల్, నవంరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సు ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే పశ్చిమ గోదావరి జిల్లా తాళ్లపూడి గ్రామానికి చెందిన ఎం.సాయి (27) ఉపాధి నిమిత్తం జగ్గంపేట రూరల్ మామిడాడలో ఇటుక బట్టీ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడికి రెండేళ్ల క్రితం వివాహం కాగా మూడురోజుల క్రితం పాప పుట్టింది. మామిడాడలో పనులు ముగించుకుని స్వగ్రామం తాళ్లపూడి వెళ్తుండగా మామిడాడ శివారుకి వచ్చేసరికి ప్రైవేటు బస్సు ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్టేషన్ రైటర్ మాణిక్యం తెలిపారు.

యువతిని మోసం చేసిన యువకుడి అరెస్టు

రౌతులపూడి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం.. రౌతులపూడి చెందిన లోవ ప్రసాద్ ఏడేళ్లుగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి అవసరాలు తీర్చుకున్నాడు. పెళ్లి చేసుకోమని యువతి రెండేళ్లుగా ప్రసాద్‌ను అడుగుతుండగా చేసుకోనని ముఖంచాటేశాడు. దీంతో ఆమె ఈనెల 7న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం రాత్రి రౌతులపూడిలో శివాలయం వద్ద నిందితుడు ప్రసాద్‌ను అరెస్టు చేశారు.

పీఏసీఎస్‌ల బలోపేతానికి కృషిచేయాలి

డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి

కాకినాడ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రైతులకు అందుబాటులో ఉండే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్)లను బలోపేతంచేసేందుకు పర్సన్ ఇన్‌చార్జిలు కృషిచేయాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి సూచించారు.ఆప్కాబ్ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో కాకినాడ డీసీసీబీలో పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలకు నిర్వహిస్తున్న వర్క్‌షాప్ మంగళవారం కొనసాగింది. సహకార చట్టం, రుణాల మంజూరు, రుణాల రికవరీ, సొసైటీల బైలాపై ఆప్కాబ్ ఫ్యాకల్టీ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సహకార శాఖ అధికారులు, డీసీసీబీ, సొసైటీల సిబ్బంది సమన్వయంతో పనిచేయడం ద్వారా డీసీసీబీ ప్రగతి పథంలోనికి వస్తుందన్నారు. రెండు రోజుల పాటు జరిగిన శిక్షణలో కాకినాడ జిల్లా నుంచి సుమారు 72 పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలు, డీసీసీబీ సీఈవో ప్రవీణ్‌కుమార్, డీపీడీఎం బాపూజీ, డీజీఎం శ్రీధర్ చౌదరి, ఆప్కాబ్ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపారాధన

● ప్రసన్నాంజనేయుడికి వేదమంత్రాలతో పూజలు ● అలరించిన సినీ సంగీత విభావరి

ద్రాక్షారామ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో 62వ కార్తీక దీపారాధన కార్యక్రమం మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం 6 గంటలకు వేదపండితుడు జుత్తుక చిన్న ఆధ్వర్యంలో ప్రసన్నాంజనేయస్వామికి వేదమంత్రాలతో లక్షతులసి, తమలపాకుల పూజలు చేశారు. స్వామివారిని పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, తనయుడు సూర్యప్రకాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కార్తీక దీపారాధన మహోత్సవంలో యాంకర్ సోనా వ్యాఖ్యానంతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శన ఆకట్టుకుంది. శుభమ్ ఈవెంట్స్ నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయనీ గాయకులు శ్రీకీర్తి, సాయిశిల్ప, ఓంకార్, నజీరుద్దీన్‌షేక్, రసూల్ ఆలపించిన సినీగేయాలు అలరించాయి. 12గంటలకు ఉమాశ్రీ కళానికేతన్ కళాకారులు ప్రదర్శించిన రామాంజనేయ యుద్ధం ఘట్టం, మయసభ, సత్యహరిశ్చంద్ర(వారణాసి)లను రంగస్థల నాటక ప్రియులు ఆసక్తితో తిలకించారు.



ఉష్ట్ర వాహనంపై ఊరేగుతున్న ప్రసన్నాంజనేయస్వామి



సినీగేయాలాపన చేస్తున్న గాయనీ, గాయకులు



రేపు విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు

పిఠాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గురువారం విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు జరుగుతుందని డీఈ శ్రీనివాసరావు తెలిపారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్ హాజరవుతారని, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే సదస్సులో వినియోగదారులు వారి సమస్యలను ప్రస్తావించవచ్చని చెప్పారు.


ప్రముఖ కథా రచయిత శ్రీకంఠస్ఫూర్తిని సత్కరిస్తున్న ఆవంత్స సోమసుందర్ లిటరరీ ట్రస్టు సభ్యులు

ఘనంగా ఆవంత్స సోమసుందర్ జయంతి

పిఠాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ కవి, ప్రముఖ రచయిత ఆవంత్స సోమసుందర్ 101వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సోమసుందర్ లిటరరీ ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆవంత్స సోమసుందర్ కథా పురస్కారాన్ని ప్రముఖ రచయిత శ్రీకంఠస్ఫూర్తికి అందజేశారు. అనంతరం శ్రీకంఠస్ఫూర్తి-విజయదుర్గ దంపతులను సత్కరించారు. కాకినాడ సాహిత్య అకాడమీ సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు. పురస్కార గ్రహీత శ్రీకంఠస్ఫూర్తి మాట్లాడుతూ సోమసుందర్ ఎన్నో రచనలు చేశారని, యువత ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పిఠాపురం ఆయన జన్మ స్థలం కావడం ఈ ప్రాంతవాసుల అదృష్టమన్నారు. కార్యక్రమంలో అద్దేపల్లి జ్యోతి, మేకా మన్మథరావు, కొండేపూడి శంకరరావు, ఫైండా శ్రీనివాసరావు, కేపీవీఎస్ఎస్ ప్రసాద్, డాక్టర్ వేదుల శ్రీరామ శర్మ, గట్టి శ్రీకృష్ణదేవరాయులు, డాక్టర్ సూర్యనారాయణ, చిన్నారి సతీష్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

'జనగణనలో కులగణన చేపట్టాలి'

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జనగణనలో కులగణన చేపట్టి కులాల ప్రాతిపదికన బీసీలకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఆ పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఆందోళన చేపట్టామన్నారు. కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్ల సత్యనారాయణ, పప్పు ఆదినారాయణ, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి భవాని, ఇతర ప్రతినిధులు రామయ్య, అనిల్ కుమార్, బాలకృష్ణ, ఏసుపాదం, అర్జున్‌రావు, రమణ, సూరిబాబు, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, చిట్టిబాబు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న భారత యజ్ఞ పీఠం కమిటీ సభ్యులు

రేపు సాగరతీరాన 50వ మహా కుంభాభిషేకం

కాకినాడ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాగరతీరాన గల శ్రీఆది కుంభేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం లోకకల్యాణార్థం 50వ మహా కుంభా భిషేకం నిర్వహిస్తున్నట్టు భారత యజ్ఞ పీఠం కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవా రం ఆలయం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సంబంధిత కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఉదయం ఆరు గంటలకు గోపూజతో కార్యక్రమం ప్రారంభమవుతుందని, కోటీ ఎనిమిది లక్షల శివలింగాలకు, పాదరస లింగానికి మహా కుంభాభిషేకం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు 101 మంది కన్యలతో అభిషేకం చేసిన ద్రవ్యాలను సాగరంలో నిమజ్జనం చేస్తామన్నారు. ఆది కుంభేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి, కోటీ ఎనిమిది లక్షల శివలింగాల శాశ్వత ఏర్పాటునిమిత్తం రూ.10 లక్షలు విరాళంగా ఇవ్వనున్నట్టు కమిటీ సభ్యుడు తోట పుండరీకాక్షుడు (బాబి) ప్రకటించారు. కమిటీ సభ్యులు చిట్నీడి శ్రీనివాస్, బోగిరెడ్డి తాతారావు, సలాది శ్రీనివాసరావు, ఆరుముగం నటరాజ్, గంగిరెడ్డి అరుణ, నామన ప్రసన్న, బూర్ల మాత తదితరులు పాల్గొన్నారు.

వేళంగిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

కరప, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వేళంగి లయన్స్ క్లబ్ నేతృత్వంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస నర్సింగ్ హోమ్ ఆవరణలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి 300 మంది విచ్చేసి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 50 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించారు. మిగిలిన వారికి ఉచితంగా కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. వేళంగి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పాతూరి శ్రీహరిచౌదరి, కార్యదర్శి మెర్ల వెంకటసీతారామప్రసాద్, కోశాధికారి యిళ్ల ఆదేశ్, లయన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ బొండా వెంకన్నరావు, బొండా చంటిబాబు, బొడ్డు భాస్కరరామన్, మెర్ల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఉచిత నేత్ర వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు

'పంతం పద్మనాభం సేవలు చిరస్మరణీయం'

కాకినాడ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల కోసం యావదాస్తిని త్యాగం చేసిన పంతం పద్మనాభం సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే పంతం గాంధీమోహన్ పేర్కొన్నారు. మాజీ మంత్రి పద్మనాభం 99వ జయంతి సందర్భంగా మంగళవారం కల్పన సెంటర్లోని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మనాభం నాటక పరిషత్ అధ్యక్షుడు బుర్రా పద్మనాభం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గాంధీమోహన్, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. పద్మనాభం నాటక పరిషత్ సభ్యుడు, జనసేన నాయకుడు ఆకుల వెంకటరమణ, పీసీసీ సభ్యుడు కుక్కల పోతురాజు, మాజీ కార్పొరేటర్ యాళ్ల రామకృష్ణ, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు, మాగాపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సకాలంలో సొమ్ములు'

సామర్లకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించి సకాలంలో సొమ్ములు పొందాలని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తుమ్మల పద్మజ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం ఆమె ఉండూరు, అచ్చంపేట, గొంచాల గ్రామాల్లో రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే ధాన్యాన్ని విక్రయించిన వారికి ఎంత సమయంలో డబ్బులు జమ అయ్యాయో తెలుసుకున్నారు. ధాన్యాన్ని క్షేత్రస్థాయిలో ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. పర్యటనలో ఉండూరు వీఏఏ భవిత, రైతులు పాల్గొన్నారు.



రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ

కరప, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. కరపలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోనే అత్యధికంగా 80శాతం సబ్సిడీపై పురుగుమందుల పిచికారీ డ్రోన్‌లను కరప మండలంలో రైతులకు అందజేశామన్నారు. వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేసి అభినందనలు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి పలువురు రైతులకు ట్రిక్ షీట్లను అందజేశారు. అనంతరం కూరాడ సొసైటీలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి రైతులతో చర్చించారు. ఆయా కార్యక్రమాల్లో కరప సబ్ డివిజన్ ఏడీ కె.బాబూరావు, ఏవో ఇమ్మిడిశెట్టి సత్య, ఎంపీడీవో జె.శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో ఎస్వీ శ్రీనివాసరావు, కరప మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్రగడ రమేష్, కూరాడ, వేములవాడ, కరప సొసైటీల చైర్‌పర్సన్‌లు వెలుగుబంట్ల సూరిబాబు, దూడల నారాయుడు, సైనవరపు భవానీశంకర్, కూటమి నాయకులు బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, నున్న గణేష్‌నాయుడు, యాళ్ల పండు, కాకర్ల బుజ్జిబాబుచౌదరి, చుండ్రు వెంకన్నరాయచౌదరి, మెర్ల వీరయ్యచౌదరి, పితాని జయరాం, ఏఈవో సతీష్, వీఏఏలు, ఇతరశాఖల సిబ్బంది పాల్గొన్నారు.


కరప రైతు సేవా కేంద్రం ఆవరణలో లబ్ధిదారులకు డ్రోన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నానాజీ



పిఠాపురం పాదగయలో లక్ష బిల్వార్చనలో పాల్గొన్న ఈవో జగన్మోహనశ్రీనివాస్, గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో శివలింగానికి అభిషేకం

మార్మోగిన శివనామ స్మరణ

పిఠాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రం మంగళవారం శివనామస్మరణతో మార్మోమోగింది. శివమాలధారులు శివలింగాలకు సామూహిక అభిషేకం చేశారు. అనంతరం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శివలింగాన్ని ఉంచి పూజలు జరిపారు. కుక్కుటేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. రాజరాజేశ్వరీదేవి, పురుహూతిక అమ్మవార్లకు కుంకుమ పూజలు జరిగాయి. ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ పూజల్లో పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. శివస్వాముల పూజ సందర్భంగా ఏర్పాటుచేసిన మంచు శివలింగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతుల్లో రంగులు మారిన శివలింగాన్ని భక్తులు దర్శించుకున్నారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తి శివాలయంలో మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. వేద పండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో 11 రకాల ద్రవ్యాలు, పళ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామిని భక్తులు దర్శించుకున్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడలోని శివాలయంలో మాస శివరాత్రి సందర్భంగా అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు ప్రత్యేక పూజలు జరిపారు. ఉమారామలింగేశ్వరస్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. శివలింగానికి పుష్పాలంకరణ చేయగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.


పిఠాపురం పాదగయలో కుక్కుటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


సామర్లకోట హరిహర క్షేత్రంలో ఎమ్మెల్యే రాజప్ప



గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఉమారామలింగేశ్వరస్వామికి పుష్పాలంకరణ

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హరిహర క్షేత్రం అన్నపూర్ణా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రత్యేక పూజలు చేశారు. లక్షపత్రి పూజ, పూర్ణాహుతి, అఖండ కోటి దీపారాధనలో పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపకుడు పరమానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో పండితులు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికారు. వేదాశీస్సులు, ప్రసా దం అందజేశారు. అన్నదానంలో సుమారు రెండు వేల మంది భక్తులు పాల్గొన్నారు.



మహిళలు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

కాకినాడ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు ఆధ్వర్యంలో మహిళలు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సంతచెరువు ఏరియాలోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి అన్న జనార్దన్ క్యారేజ్ ద్వారా పేదలకు అన్నదానం చేశారు. ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి పద్మకుమారి, జిల్లా అధ్యక్షుడు బత్తుల సూర్యప్రసాద్, ప్రత్తిపాడు శాఖ అధ్యక్షుడు అడపా జగదీష్, కాలాడి వెంకటేష్, కర్రి వీరబాబు, సత్తిబాబు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న మహిళలు

వాకతిప్పలో వైసీపీ కోటి సంతకాల ఉద్యమం

కొత్తపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైసీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతావిశ్వనాథ్ సూచనతో ఆ పార్టీ మహిళా విభాగం కొత్తపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో వాకతిప్పలో మంగళవారం కోటి సంతకాల ఉద్యమం చేపట్టారు. సదరు జీవోను రద్దు చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామని వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత అన్నారు. మండల శాఖ అధ్యక్షురాలు జ్యోతుల వాణి, ఆలపు సుధారాణి, రాసంశెట్టి భవాని, వడ్డి నాగమణి, అనిశెట్టి సుభాషిణి, వైసీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రావు చిన్నారావు, కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో కోటి దీపోత్సవం

కాకినాడ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జగన్నాథపురం 17వ డివిజన్‌లోని కోటిస్తంభంపేటలో మంగళవారం కోటి దీపాల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జనసేన ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి బడే వెంకటకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ ధనమ్మతల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య జ్యోతిప్రకాశనం చేశారు. వెంకటకృష్ణను అమ్మవారి కండువాతో సత్కరించారు. పినిశెట్టి సురేష్ సహకా రం అందించారు. ఫౌండేషన్ సభ్యులు పిడకా శేషు, రామశేషు, తెప్పల సత్తిబాబు, మల్లాడి రామలక్ష్మణ్, సూరాడ శ్రీకాంత్, చోడిపల్లి తాతాజీ, సూరాడ తాతాజీ, అప్పారావు, శిరీష, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


జ్యోతిప్రజ్వలనతో కోటి దీపాల మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే సహకారంతో ఆలయ స్థలం అప్పగింత

కాకినాడ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాల వెంకటనగర్‌లో గల ఓం శ్రీబాల వేంకటేశ్వరస్వామి ఆలయ స్థలాన్ని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సహకారంతో దేవాదాయ శాఖ అధికారులు తిరిగి అప్పగించారు. ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఫౌండర్ ట్రస్టీ వీఎస్ఆర్‌బీ స్వామి మాట్లాడుతూ 1962లో ఓం శ్రీబాల వేంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయం, రామాలయంలను దాత పితాని సూరయమ్మ కుటుంబీకులు తమ స్వశక్తి, భక్తుల సహకారంతో నిర్మించారన్నారు. ఆలయం శిథిలావస్థకు చేరడంతో 2018లో ఎమ్మెల్యేగా ఉన్న కొండబాబు నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. అయితే ఆ తర్వాతి ప్రభుత్వంలోని నాయకులు ఈ స్థలాన్ని కబ్జా చేశారన్నారు. దీంతో స్థలాన్ని ఆలయానికి అప్పగించాలని దేవదాయ శాఖ అధికారుల చుట్టూ తిరిగామన్నారు. కొండబాబు ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టేలా ఈ స్థలాన్ని తిరిగి ఆలయానికి అప్పగించేలా కృషి చేశారన్నారు. రామాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయం, యాగశాల, నవగ్రహాల ఆలయం నిర్మిస్తామన్నారు. సమావేశంలో వెంకట నాగేశ్వరి, మంగలక్ష్మి, త్రిలోక సత్యనారాయణ, దుర్గ జయంతి, జి.సుహాసిని పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న ఆలయ ఫౌండర్ ట్రస్టీ స్వామి

కాపుల సంక్షేమానికి పాటుపడతా: కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మి



పిఠాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాపుల సంక్షేమానికి పాటుపడతానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా లక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ఆమెను పిఠాపురం నియోజకవర్గ జనసేన, కాపు, ఇతర నాయకులు మర్యాదపూర్వంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో బాలిపల్లిరాంబాబు, రెడ్డెం జనార్దన్, జ్యోతుల సతీష్, జవ్వాది జోగేశ్వరరావు, కరెడ్ల పద్మరాజు,కర్రి దుర్గాప్రసాద్, ఊటా రామకృష్ణ, కొత్తపల్లి బుజ్జి, పాలిక ప్రవీణ్, పల్లా శ్రీను, దంగేటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.


సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో తెలంగాణ మహిళలు జ్యోతిర్లింగార్చన చేశారు. (పైన), భీమేశ్వరాలయంలో ఆశీస్సులందుకున్న సినీనటుడు గౌతంరాజు కుటుంబం (కింద)



నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం అందజేత

సామర్లకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో దేవదాయ శాఖ నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన కొరిపిళ్ల కాశీవిశ్వనాథం-ఉమాసుందరీదేవి దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఈవో బళ్ల నీలకంఠానికి మంగళవారం అందజేశారు. తొలుత వారికి స్వామి, అమ్మవార్ల ప్రత్యేక దర్శనం చేయించారు. నంది మండపం వద్ద వేద పండితుల ఆశీర్వచనం ఇవ్వగా ప్రసాదం, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను ఈవో నీలకంఠం అందజేశారు.

మత్స్యకారులకు ఓఎన్జీసీ నష్టపరిహారం పంపిణీ

తాళ్లరేవు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గాడిమొగ పంచాయతీ పెదవలసల గ్రామంలో వివిధ కారణాలతో నిలిచిపోయిన ఓఎన్జీసీ నష్టపరిహారాన్ని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ల ఆదేశాల మేరకు మంగళవారం టీడీపీ నేతలు పంపిణీ చేశారు. 343 మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ.63,250 చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగసూర్యనారాయణ, వాడ్రేవు వీరబాబు, నడింపల్లి వినోద్, పెసింగి ఈశ్వరరావు, సంగాడి కామేశ్వరరావు, మల్లాడి సీతారామరాజు, ఎంపీటీసీ చెక్కా కామేశ్వరరావు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ఆకస్మిక తనిఖీ

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సంతచెరువు వద్ద గల అన్న క్యాంటీన్‌ను కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనరు కేటీ సుధాకర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూను కచ్చితంగా పాటించాలని, భోజనం శుచిగా, రుచిగా అందించాలని, సమయపాలన తప్పనిసరిగా పాటించాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్నా క్యాంటీన్లలో ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. అనంతరం అల్పాహారం చేస్తున్న ప్రజలతో మాట్లాడి రుచి, నాణ్యత, సేవలపై వారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు.

పన్నుల వసూలుతోనే ప్రగతి

గొల్లప్రోలు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పంచాయతీలకు సకాలంలో పన్నులు చెల్లిస్తేనే ప్రగతి సాధ్యమవుతుందని ఎంపీడీవో సెలెట్‌రాజు పేర్కొన్నారు. గొల్లప్రోలు మండలం వన్నెపూడి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఆయన వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. గృహ, ఇతర పన్నుల చెల్లింపులో జరిగే జాప్యం, తద్వారా ఎదురయ్యే సమస్యలపై చర్చించారు. ఈవో పీఆర్డీ కుమార్, పంచాయతీ కార్యదర్శి వరహాలు పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణ తరగతులు

సామర్లకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక ప్రత్యేక శిక్షణ తరగతులను ఎంపీడీవో కరక హిమమహేశ్వరి మంగళవారం ప్రారంభించారు. క్లీన్ అండ్ గ్రీన్ థీమ్‌పై గ్రామాల్లో పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకం నిషేధం, నిధుల కేటాయింపు తదితర అంశాలను టీవోటీ టి.సత్యనారాయణ సమగ్రంగా వివరించారు. ఈవోపీఆర్డీ భైరవమూర్తి, ఎంపీపీ సత్తిబాబు, కార్యదర్శులు కొర్ల బుల్లియ్య కాపు, శ్రీహరి, ఎస్.ముసలయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

'ఫైవ్‌మెన్ కమిటీలో బీసీలకు ప్రాధాన్యమివ్వాలి'

కొత్తపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో ఏర్పాటు చేసిన ఫైవ్‌మెన్ కమిటీలో బీసీలకు కూడా ప్రాధాన్యమివ్వాలని కొత్తపల్లి మండల బీసీ సంఘం నాయకుడు, మాజీ ఎంపీటీసీ కండేపల్లి నూకరాజు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

నేత్ర వైద్య పరీక్షలు

పిఠాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉద్యోగులకు కాకినాడకు చెందిన డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి సిబ్బంది కంటి వైద్య పరీక్షలు చేశారు. కమిషనరు పి.రాజు, వైద్యులు విసరపు త్రినాథ్, ప్రియాంక భాయ్, టెక్నీషియన్ హేమంత్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం

కిర్లంపూడి, నవంబరు18(ఆంధ్రజ్యోతి):మండలంలో వీరవరం జడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, వీరవరం పీఏసీఎస్ చైర్మన్ తోట గాంధీ ఆధ్వర్యంలో వాసన్ కంటి ఆసుపత్రివారి మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఏలేరు ప్రాజెక్టు చైర్మన్ బస్వా వీరబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు పలువురికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గొల్లపల్లి సూరిబాబు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

చిత్తశుద్ధితో పనిచేస్తే తప్పక గుర్తింపు

● కార్యకర్తలకు ఎమ్మెల్యే శిరీషాదేవి హితవు

దేవీపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిత్తశుద్ధితో పనిచేసిన కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. ఇందుకూరులో మంగళవారం దేవీపట్నం మండలం, అనుబంధం సంఘాలు, ఇందుకూరుపేట సొసైటీ చైర్మన్, పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం పార్టీ మండల అధ్యక్షుడు గోళ్ళ చంటిబాబు అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కొల్లుబోయిన శ్రీనివాస యాదవ్ సౌజన్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీని నమ్ముకున్న వారికి గుర్తింపు లభిస్తుందన్నారు. నూతనంగా పీఏసీఎస్ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన మాగాపు బాబూరావు, కొండ్ల చినకొండారెడ్డి, పాలకమండలి సభ్యులు, గండిపోచమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ మలుగుల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కీర్తి గంగాధర్, తెలుగు యువత మండల అధ్యక్షుడు జొన్నల శ్రీనివాస్‌కుమార్‌లను ఆమె సత్కరించారు. ఎస్టీ కమిషన్ డైరెక్టర్ గొర్లె సునీత, ఏపీఐఐసీ డైరెక్టర్ గొల్లపూడి పెద్దారాజు, నూర్ భాషా కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభానీ, రైతు అధికార రాష్ట్ర ప్రతినిధి కనిగిరి రాంబాబు, ఏఎంసీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, మరిశెట్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మండలంలో సామాజిక న్యాయశాఖ ఉప కార్యదర్శి పర్యటన



జస్బీర్‌సింగ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

వై.రామవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ సామాజిక న్యాయశాఖ ఉపకార్యదర్శి జస్బీర్ సింగ్ మంగళవారం వై.రామవరం మండలంలో పర్యటించారు. ఈసందర్భంగా ఆస్పిరేషనల్ బ్లాక్స్‌ను ఆయన సందర్శించారు. అధికారులు ఆయనకు క్షేత్రస్థాయి ఫలితాలు, పురోగతి, భవిష్యత్ కార్యాచరణ వివరించారు. స్థానిక భవిత పాఠశాలను సందర్శించి దివ్యాంగ విద్యార్థులకు అందిస్తున్న సేవలు, పునరావాసం తెలుసుకున్నారు. ఆయన్ను ఎంపీడీవో బాపన్నదొర, ఇతర అధికారులు సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్య క్రమంలో డీఎల్‌పీవో, నీతి అయోగ్, వై.రామవరం, గంగవరం, మారేడుమిల్లి మండలాల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరీషాదేవిని కలిసిన టీడీపీ మండల నాయకులు

వీఆర్‌పురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరంలో ఎమ్మెల్యే శిరీషాదేవిని మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు బొర్ర నరేష్ కుమార్, టీడీపీ నాయకులు కలిశారు. మండలంలోని పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎం.రామారావు, నాయకులు మామిడి రాజు, బింగి విష్ణు పాల్గొన్నారు.

వృద్ధుల బాధ్యత పిల్లలదే

అడ్డతీగల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వృద్ధులైన తల్లిదండ్రులను చూడాల్సిన బాధ్యత పిల్లలదేనని అడ్డతీగల జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.మురళి గంగాధరరావు అన్నారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రుల యోగక్షేమాలు పిల్లలు పట్టించుకోకుండా వృద్ధాశ్రమంలో వదిలేస్తే ఆయా తల్లిదండ్రులకు మెయింటనెన్స్ కేసు వేసుకునే అవకాశం ఉందన్నారు. సదస్సులో ప్యానెల్ లాయర్స్ రమణ, డి.శ్రీధర్, ఈ.గౌరీశంకర్, వై.శ్రీనివాసరావు, గంగాధర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్

రంపచోడవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించి ప్రతి పాఠశాలలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ అన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి బ్రాహ్మజీరావు, డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, జిల్లా సర్వశిక్షాభియాన్ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ వీఏ స్వామి నాయుడు, డీఈవో వై.మల్లేశ్వరరావుతో ఆయన వర్క్‌షాప్ నిర్వహించారు. ఏటీడబ్ల్యువోలు కృష్ణమోహన్, జి.తులసీదాస్, మండల విద్యాశాఖాధికారులు కేవీవీ సత్యనారాయణ, ముత్యాలరావు, ఆర్.ఎల్.శ్రీనివాసరావుపాల్గొన్నారు.

'ఉపాధి' ప్రణాళికలు సిద్ధం

రంపచోడవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం క్లస్టర్ పరిధిలో 2026-27కి గ్రామాల్లో ఉపాధి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ఏపీడీ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం గత అక్టోబరు 2నుంచి జరుగుతున్న ప్రణాళికల తయారీలో ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొని సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఈఆర్థిక సంవత్సరానికి 15,24,775 పనిదినాల లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఉద్యాన పంటలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ 41రకాల ప్రాజెక్ట్ పనులు గిరిజనుల అవసరాల మేరకు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. ఉపాధి పనులు పారదర్శకంగా జరుగుతున్నాయని, గ్రామీణ శ్రామికులకు రూ.300 తక్కువ లేకుండా రోజువారి వేతన అందేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

మన్యంలో వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, నవంరు 18(ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి మండలం పాపికొండలు అభయారణ్యంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందడంతో డొంక రాయి, ఆంధ్ర ఒడిశా రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా గస్తీ పెంచారు. మంగళవారం డొంకరాయిలో పోలీస్ చెక్‌పోస్టు వద్ద డొంకరాయి ఎస్ఐ ఎస్.వెంకయ్య ఆధ్వర్యంలో సరిహద్దు గ్రామాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ కల్యాణ్, సివిల్ పోలీసులు, సీఆర్పీఎఫ్‌బీ/42 బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసిత ఖాతాదారులు ఆందోళన చెందొద్దు

కూనవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులుగా ఉన్న పోలవరం నిర్వాసితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సతీష్ చంద్ర తెలిపారు. పోలవరం నిర్వాసితులకు బ్యాంక్‌లో టెక్నికల్ ఇష్యూ కారణంగా పరిహారం నగదు జమ కావడం లేదన్నారు. ఎస్‌బీఐతో పాటు మిగతా బ్యాంక్ ఖాతాదారులకు పరిహారం జమవుతున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు మాత్రం పరిహారం జమ కాకపోవడంతో పోలవరం నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆ బ్యాంకు రీజనల్ మేనేజర్ సతీష్‌చంద్రను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరింది. ఇప్పటికే తాము పోలవరం ప్రాజెక్ట్ ఆర్‌అండ్‌ఆర్ అడ్మినిస్ట్రేటర్ అభిషేక్ గౌడ్‌తో మాట్లాడామని, రెండు రోజుల్లో గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులు కొంతమందికి పోలవరం పరిహారం నగదు జమ అవుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులు వేరే బ్యాంకుల్లో పరిహారం కోసం కొత్త ఎకౌంట్లు తీయాల్సిన అవసరం లేదన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంలో కార్తీక దీపోత్సవం దృశ్యం



అరుణాచలేశ్వరుడికి పుష్పాభిషేకం, నందీశ్వరుడికి పంచామృత అభిషేకాలు చేస్తున్న భక్తులు

అరుణాచలేశ్వర ఆలయంలో లక్ష దీపోత్సవం

దేవతామూర్తులకు పంచామృత అభిషేకాలు

ప్రత్తిపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో ఉన్న ఆంధ్రా అరుణాచలంగా ప్రసిద్ధి చెందిన అరుణాచల క్షేత్రంలో కార్తీకమాస శివరాత్రిని పురస్కరించుకుని మంగళవారం అపీత కుచాంబసమేత అరుణాచలేశ్వరుడికి సుబ్రహ్మణ్యేశ్వరస్వామితోపాటు పలు దేవతామూర్తులకు మంగళవారం పంచామృత అభిషేకాలు, పుష్పాభిషేకాలు, విశిష్టఅలంకరణలు, పంచహారతులు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో లక్ష దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా మహా శివలింగం, ఓంకారం, త్రిశూలం శివపార్వతుల ఆకృతులతో కూడిన దీపాలను వెలిగించారు. మహిళలు పుష్కరిణివద్ద పూజలు నిర్వహించి కార్తీక దీపాలను వదిలారు. పుష్కరిణివద్ద మహిళలు పంచహారతులతో గంగాహారతి నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు స్వామిరామానంద ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

చిరుధాన్యాల సాగుతో అదనపు ఆదాయం

శంఖవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాల సాగుతో రైతులు అదనపు ఆదాయం పొందవచ్చునని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ అన్నారు. వేలంగి, ధారమల్లాపురం గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు రాగి, పత్తి, కంది, వరి పంటలను పరిశీలించి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రాగి పంట సాగుతో పౌష్టికాహారంతోపాటు పశువులకు గ్రాసాన్ని దానాగా వాడుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, ఉద్యాన సహాయకులు ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

'విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకోవాలి'

ప్రత్తిపాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణ ఉత్తమ నడవడిక కలిగి ఉండాలని ప్రత్తిపాడు ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం ఉద్బోధించారు. మండలంలోని లంపకలోవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సాయంత్రం విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌లు, మత్తు పదార్థాల బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై విచారణ జరపాలి'

ప్రత్తిపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లిలో జరిగిన హిడ్మా ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రావు డిమాండ్ చేశారు. కాకినాడజిల్లా ప్రత్తిపాడులో మంగళవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరుగురు మావోయిస్టు నాయకులను మారేడుమిల్లి రోడ్డు పక్కన ఎదురుకాల్పుల్లో చనిపోయారని ప్రకటించడం నమ్మ శక్యంగా లేదన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌పై ప్రస్తుత న్యాయ మూర్తితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవైపు నుంచి శాంతి చర్చలకు వారు సిద్ధమని ప్రకటిస్తుంటే మరోవైపు ఇటువంటి చర్యలకు పాల్పడడం చాలా అన్యాయమని ఆయన అన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌పై అనేక అనుమానాలకు తావిస్తున్న దృష్ట్యా దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని బంగ్రరాజుడి మాండ్ చేశారు.

గోపాలపట్నంలో వారాహి పూజలు ప్రారంభం



వారాహి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తొండంగి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం గ్రామంలో త్రిమూర్తి ఆలయానికి ఎదురుగాగల ప్రాంతంలో వారాహిమాత పూజలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు వారాహిని మాత దీక్షాపీఠం ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరగనున్నాయి. మంగళవారం గోపూజ, కలశస్థాపన, మండపారాధన, అగ్నిస్థాపన అనంతరం గణపతిసమేత సుదర్శన శ్రీరామ హనుమత్ యాగం నిర్వహించారు. వేదమంత్ర పఠనం, సుందరకాండ పారాయణ నిర్వహించారు. పవనానందస్వామి ఆధ్వర్యం లో బుధ, గురువారాలు అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నా రు. వారాహిమాత విగ్రహంవద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోలాహలంగా కార్తీక వన సమారాధనలు

ప్రత్తిపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక వనసమారాధనలు మండలంలో పలుచోట్ల కోలాహలంగా నిర్వహించారు. ప్రత్తిపాడు తోటవీధిలోని సాయిబాబు, వెంకటేశ్వరస్వామి ఆలయంవద్ద ఆలయ నిర్వాహకులు చిలకమర్తి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ అన్న సమారాధనలో సర్పంచ్ గుడాల విజయలక్ష్మి వెంకటరత్నంతోపాటు గ్రామస్థులు పాల్గొన్నారు. స్థానిక అడ్వకేట్ కిలపర్తి శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్తీక వనసమారాధనలో బీసీ సంఘం నాయకులతోపాటు వెలమ సంఘం సామాజిక వర్గీయులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని ఎరకంపాలెం కొండ దిగువన ఉన్న భ్రమరాంబ మల్లికార్జున స్వామిఆలయంలో బ్రహ్మచారి లక్ష్మణానందస్వామి, వేదపండితులు కొక్కిరిగడ్డ సత్తిబాబు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు రుద్రాభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. కార్తీకమాసంలో మాస శివరాత్రిశివునికి ఎంతో ఇష్టమైన రోజు కావడంతో ఈ ఆలయంవద్ద తెల్లవారుజాము నుంచే భక్తులు అభిషేకాలు పూజలు చేశారు.

ఇరుముడి వేడుకకు వెళ్లి.. విగతజీవిగా మారిన తండ్రి

● సొమ్మసిల్లి కుప్పకూలిపోయాడు

ప్రత్తిపాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కుమారుడి ఇరుముడి వేడుకకువెళ్లి అంతలోనే విగతజీవిగా మారిన తండ్రి ఉదంతం చోటుచేసుకుంది. ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన ఉర్లంకల చక్రరావు కుమారుడు అయ్యప్ప మాల దీక్ష చేపట్టారు. 41రోజులు మండలదీక్ష పూర్తి కావడంతో స్థానిక శివాలయంలో కుమారుడు ఇరుముడి వేడుకకు మంగళవారం ఉదయం తండ్రి శివాలయానికివచ్చి స్నానాలు ఆచరించి ఇరుము డి కార్యక్రమానికి వచ్చారు. అంతలోనే ఏమి జరిగిందో తెలియని పరిస్థితిలో సొమ్మసిల్లి కుప్పకూలిపోయాడు. దీంతో చక్రరావును ఆసుపత్రికి తరలించేలోపే మృతిచెందాడు. గొర్రెల పెంపకం పనులు చేసే ఉర్లంకల చక్రరావు ఆకస్మిక మృతితో గ్రామంలోని సీతంపేటలో విషాదం అలుముకుంది. మృతుడు చక్రరావుకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సర్పంచ్‌లకు శిక్షణా తరగతులు

ప్రత్తిపాడు, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్పంచ్‌లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. గ్రామాల్లో క్లీన్ అండ్ గ్రీన్‌పై ఎంపీడీవో కుమార్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవోలు కాశీవిశ్వనాధ్, సీవోటీ కె.నాగార్జునలు వివరించారు. సర్పంచ్ బెంతుకుర్తి సుశీల, సత్యనారాయణ, కార్యదర్శులు జ్యోతుల పద్మరాజు, ఎం.లక్ష్మీనారాయణ, వి.వీరబాబు, గంగాభవాని, కార్యదర్శులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

జగ్గంపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జగంపేటటౌన్ పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జగ్గంపేట జనసేనపార్టీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీ న్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు హాజరై పేదలకు భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ మా నాయకుడు తుమ్మలపల్లి రమేష్ పవన్ కల్యాణ్‌ని స్ఫూర్తిగా తీసుకుని తన సొంత ఖర్చులతో ప్రతి మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహిస్తున్నారని, సేవా కార్యక్రమాలను చేస్తున్నారని అన్నారు. మంగళవారం



డొక్కా సీతమ్మ క్యాంటీన్లో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

డొక్కా సీతమ్మ కాంటీన్ ద్వారా సుమారు 500 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాదారపు వీరబాబు, కురుమల్ల నాగేశ్వరా వుసత్తి సోమరాజు, గంధం శ్రీను, అంకం ఓం కృష్ణ, మెడిబోయిన గంగ, జీవీ నాయుడు, బలిరెడ్డి గణేష్, వెంకటరమణ, రాజు, పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి

● ఎంపీడీవో హరికృష్ణ సత్యరెడ్డి



కార్యదర్శులు, సర్పంచ్‌లకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో హరికృష్ణసత్యరెడ్డి

గండేపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కాలుష్య నివారణ, పచ్చదనం పెంపొందించేందుకు ప్రతీ గ్రామంలోమొక్కలు నాటాలని ఎంపీడీవో హరికృష్ణ సత్యరెడ్డి అన్నారు. మంగళవారం స్థాని క మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు క్లీన్‌అండ్‌గ్రీన్ అనే అంశంపై అవ గాహన సదస్సు నిర్వహించారు. ముందుగా మల్లేపల్లి గ్రామ సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి మృతికి సంతాపం తెలుపుతూ మౌ నం పాటించారు. ఈసందర్భంగా ఎంపీడీవో హరికృష్ణసత్యరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో ఐఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా, పచ్చదనంగా ఉంచేందుకు తీసుకోవాల్సిన అంశా లపై వివరించారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. తడి, పొడి చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించారన్నారు. కార్యక్రమంలో మురారి ఉపసర్పంచ్ జాస్తి వసంత్, ముత్యాల దుర్గారావు, కార్యదర్శులు ఫణీంద్రకుమార్, బాలు, వీరేంద్రచౌదరి, పెనుమర్తి చక్రధరుడు, సీహెచ్ సత్యనారాయణ, చరణ్ ఉన్నారు.

ఉపాధి పథకంలో 200 రోజుల పనిదినాలు కల్పించాలి

● శరభవరంలో లిబరేషన్ ప్రదర్శన



ధర్మవరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ ఎంఎల్ కార్యకర్తలు

ప్రత్తిపాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో 200రోజులు పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ లిబరేషన్‌పార్టీ కార్యకర్తలు మంగళవారం సాయంత్రం ధర్మవరంలో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక సంజీవయ్యనగర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి నంది సెంటర్‌వరకు ఈ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో పనిచేసే కూలీలకు రోజువారి కూలి వేతనం రూ.600 చెల్లించాలన్నారు. గ్రామంలోని కూలీల వలసలు నివారించడాకి పనులు కల్పించాలన్నారు. డిసెంబరు 6, 7 తేదీల్లో కడపలో జరిగే లిబరేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని లిబరేషన్ కార్యకర్తలు కోరారు. కార్యక్రమంలో అనుసూరి లక్ష్మి, తిరగటి నాగమణి, వల్లూరి సూర్యారావు, గుడాల వెంకటలక్ష్మి, పల్లా లక్ష్మి, రాపా నాగరత్నం, గుడాల వీరలక్ష్మి, సింగులూరి చక్రం, చింతల అచ్చియమ్మ, జెడ్డా గన్నెమ్మ, చెక్కల ప్రేమకుమారి పాల్గొన్నారు.

మొక్కుబడిగా మరమ్మతులు

● ఇబ్బందిపడుతున్న వాహనదారులు



పూడ్చిన గుంటల నుంచి చెల్లాచెదురైన కంకర

తొండంగి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిత్యంరద్దీగా ఉండే ప్రాంతంలో రహదారుల శాఖ నిర్వహిస్తున్న మరమ్మతులు ప్రయాణికుల నుంచి విమర్శలు ఎదుర్కొంటోంది. అన్నవరం దానవాయిపేట రహదారికి గోపాలపట్నంవద్ద పెద్దపెద్ద గోతులు పడగా వాటికి ఇప్పటికే మూడుసార్లు మరమ్మతులు చేపట్టారు. కేవలం క్రషర్ బూడిద, పిక్కతో గుంటలు పూడ్చడం, తిరిగి కంకరపిక్క మొత్తం చెల్లాచెదురుగామారి యథావిధిగా గుంటలు ఏర్పడడం పరిపాటిగా మారింది. గతంలో మూడుసార్లు వేసిన కంకర ఎప్పటికప్పుడు చెల్లా చెదురుకావడంతో ప్రయాణికులు వాహనదారులకు ఇబ్బందిగా మారింది. తారుతో శాశ్వత ప్రాతిపదికన చేయాల్సిన పనులు మొక్కుబడిగా చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాస్థాయి జూడో పోటీలకు విద్యార్థుల ఎంపిక

జగ్గంపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్‌లో మంగళవారం జిల్లాస్థాయి జూడో పోటీలకు ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా కాకినాడజిల్లా జూడో అసోసియేషన్ చైర్మన్ కృష్ణారావు, జిల్లా జూడో సెక్రటరీ తాండ్రోతు వీర వెంకట రమణ, జూడో కోచ్ పి.వి.తేజ ఎంపిక వివరాలను తెలియజేశారు. రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కాకినాడ నుంచి విద్యార్థులు ఎంపిక కావడం గర్వకారణమని నాయకులు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులందరూ ఈనెల 22, 23 తేదీలలో కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి జూడో పోటీ లకు హాజరు కానున్నారు. ఎంపికైన మొత్తం జూడో క్రీడాకారులకు అభినందనలు తెలియజేస్తూ రాబోయే రాష్ట్ర పోటీలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

కలెక్టర్ ఆదేశాలో గ్రావెల్ తొలగింపు

తుని రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తుని పట్టంలో గణపతి నగర్‌లో రోడ్డు కబ్జా చేస్తున్నారని వాకర్స్ క్లబ్ సభ్యులు పిర్యాదు చేయడంతో కలెక్టర్ చర్యలుచేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రోడ్డుపై నింపిన గ్రావెల్‌ను యజమానులు తొలగింపునకు చర్యలు చేపట్టారు.

బ్రహ్మకుమారీల ప్రచారాన్ని అడ్డుకున్నగ్రామస్థులు

తుని రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని రూరల్‌లో బ్రహ్మకుమారీస్ రథ యాత్ర నిర్వహించేందుకు సంకల్పించి తునిరూరల్ తేటగుంట తిమ్మాపురంలోకి ప్రవేశించే సరికి కొంతమంది యువకులు వారిని అడ్డుకున్నారు. హిందూ ధర్మ ప్రచారం పేరుతో అన్యమత ప్రచారం చేస్తున్నారని సంబంధిత యువకులు ఆరోపించారు. దీంతో ఇరువురి మధ్య తోపులాట, తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దీంతో బ్రహ్మకుమారీస్ సంస్థ వారు తుని రూరల్ పోలీసులను ఆశ్రయించగా సంబంధిత విషయంపై పోలీసులు కేసు విచారణ చేపడుతున్నారు.

డీసీసీబీ చైర్మన్‌ను కలిసిన పీఏసీఎస్ అధ్యక్షుడు



డీసీసీబీ చైర్మన్‌తో తుని నియోజకవర్గానికి చెందిన పీఏసీఎస్ అధ్యక్షులు

తునిరూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబును తుని నియోజకవర్గానికి చెందిన ఎస్.అన్నవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ పోలిశెట్టి రామలింగేశ్వరరావుతో కలిసి ఎన్ఎంపట్నం, కోటనందూరు పీఏసీఎస్ చైర్మన్‌లు తుమ్మల బాబును కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల నుంచి తుని నియోజకవర్గంలో గల 3సొసైటీలకు రూ.11కోట్ల రుణప్రణాళికను ఎమ్మెల్యే దివ్య మార్గనిర్దేశం చేయగా సంబంధిత పత్రాన్ని తుమ్మల బాబుకు అందజేశారు. ఏకకాలంలో 3 సొసైటీల నుంచి రూ.11కోట్లు రుణ ప్రణాళిక మంజూరు చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, నవంబరు18(ఆంధ్రజ్యోతి):మండలంలో గండేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న రామయంపాలెం, సింగరంపాలెం గ్రామాలకుబుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు, గండేపల్లి ఏఈ కిరణ్‌కిషోర్ తెలిపారు. సింగరంపాలెం నూతన సబ్‌స్టేషన్ పనుల్లో భాగంగా అంతరాయం కలుగుతుందని అధికారులకు వినియోగదారులు సహకరించాలన్నారు.

తుని రైల్వేస్టేషన్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి

తునిరూరల్, నవంరు 18 (ఆంధ్రజ్యోతి): తుని రైల్వేస్టేషన్‌లో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్టేషన్‌మాస్టర్ రైల్వే పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు తెలిపారు. మృతుడు 55నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటాడని 2వ ప్లాట్‌ఫామ్ చివరి కొండవారిపేట సమీపంలో అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నాడని మృతుడి వద్ద వివరాలు లభించలేదని రైల్వే సబ్‌ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు తెలిపారు. మృతదేహాన్ని గవర్నమెంట్ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించామని మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలిస్తే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

బస్టాపుల్లో ఆగని బస్సులు

● విద్యార్థులకు తప్పని బస్సు ఇక్కట్లు

● కాలేజీకి ఆలస్యమవుతుందని ఆందోళన

గండేపల్లి, నవంబరు18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినప్పటి నుంచి కాలేజీకి వెళ్లే విద్యార్థులకు ఉద్యోగం, ఉపాధి కోసం వెళ్లే వారికి ప్రయాణికులకు బస్సు ఇక్కట్లు తప్పడంలేదని పలువురు అ ంటున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లోనే కొన్ని బస్సులు ప్రయాణికులతో నిండిపోయి వెళుతుంటే మరికొన్ని బస్సులు ఖాళీగా ఉన్నప్పటికీ ఆగకుండా వెళ్లిపోతున్నాయని దీంతో సమయానికి అనుకున్న గమ్యానికి చేరుకోలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులైతే కాలేజీకి వెళ్లేందుకు 6గంటలకు రోడ్డుపైకి వచ్చినప్పటికీ గంటలు తరబడి బస్సులకోసం వేచిచూడాల్సి వస్తోంది. బస్సులు మాత్రం ఆగకుండా వెళ్లిపోతున్నాయని అంటున్నారు. దీంతో ఉదయం 8.30కు కాలేజీకి వెళ్లాల్సి ఉండగా 10గంటలకు వెళుతున్నామంటున్నారు. బస్సుల కోసం ఎదురుచూసి ఆటోలు ఎక్కి వెళ్లిపోతున్నారు. ప్రశ్నిస్తే ఇక్కడ స్టాప్ లేదని సమాధానం ఇస్తున్నారంటున్నారు. మండలంలోని నీలాద్రిరావుపేట నుంచి మురారి వరకు సుమారు 19 కిలోమీటర్ల మేర జాతీయరహదారి ఉంది. ఈ రహదారిని ఆనుకుని బొర్రంపాలెం, తాళ్ళూరు, మల్లేపల్లి, గండేపల్లి గ్రామాలున్నాయి. రోజూ కాలేజీకి వెళ్లేందుకు రామయ్యమ్మపాలెం,



మల్లేపల్లిలో ఆపకుండా వెళ్లిపోతున్న బస్సు

సింగరంపాలెం, ఎన్టీరాజాపురం, సుబ్బయమ్మపేట, ఉప్పలపాడు గ్రామాల నుంచి పలువురు విద్యార్థులు బస్సు ఎక్కేందుకు హైవేపైకి వస్తా రు. దీంతో హైవే బస్సులు ఆపేందుకు ప్రయత్నించిన ఆపకపోవడంతో కాలేజీ, ఆఫీస్ కు లేటవుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్ప టికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బస్సులు ఆపకపోవడంతో ఆటోలో వెళుతున్న విద్యార్థులు